జగనన్న విద్యా కానుకల పంపిణీ



జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తదితరులు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలు శనివారం పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, మల్లేటి హరిశంకర్, పాఠశాల కమిటీ చైర్మన్ ఎం.అప్పలకృష్ణ పాల్గొన్నారు.

జీవీఎంసీ కార్మికుల సమ్మె నోటీసు



జెడ్సీ రాముకు నోటీసు అందిస్తున్న నాయకులు

భీమునిపట్నము: జీవీఎంసీ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తున్నందున సమ్మెలోకి వెళ్లాల్సి వస్తోందని సీఐటీయూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి అన్నారు. ఈ మేరకు శనివారం భీమిలి జోనల్ కార్యాలయంలో జెడ్సీ రాముకు కార్మికులు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్స్ పరిష్కారానికి చర్యలు చేపట్టనందున ఈ నెల 19 నుంచి సమ్మెలోకి వెళ్లనున్నట్టు చెప్పారు. డిమాండ్ల సాధన కోసమే సమ్మెలోకి వెళ్తున్నామని పేర్కొన్నారు.

రీ సర్వే కోసం గ్రామ సభలు

పద్మనాభం: రీ సర్వే చేయడానికి ముందస్తుగా మండలంలోని ఆరు గ్రామాల్లో శనివారం గ్రామసభలు నిర్వహించారు. మద్ది, బాందేవుపురం, పాండ్రంగి, కొవ్వాడ, గంధవరం, నరసాపురం గ్రామాల్లో ఈ సభలు నిర్వహించారు. రీ సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. రీ సర్వే జరిగేటప్పుడు రైతులు చూపించాల్సిన డాక్యుమెంట్లు, ఆధారాలపై వీఆర్వోలు వివరించారు.

గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలి

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలోని కొండపై జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలను అరికట్టాలని మండల సచివాలయాల కన్వీనర్, మాజీ సర్పంచ్ సరగడ రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొండపై గ్రావెల్ తవ్వుతున్న వారి లారీలను ఈ నెల 10న భీమిలి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని, రూ.50వేలు జరిమానా విధించారన్నారు. భవిష్యత్తులో తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విద్యార్థికి ప్రశంసాపత్రం అందించి సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

ఆనందపురం: రాష్ట్రంలోని పేద పిల్లలకు కార్పొరేట్ పాఠశాలల స్థాయి విద్యను అందించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఉన్నత పాఠశాలలో శనివారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల, పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో విద్యా రంగంలోని లోపాలు గుర్తించారని చెప్పారు. సమూల మార్పుల కోసం 'నాడు – నేడు' పథకంతో పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు సమకూర్చుతున్నారని వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద పిల్లల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పెడితే... తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కొద్ది మొత్తానికే ఆ పథకాన్ని పరిమితం చేసిందన్నారు. పాదయాత్రలో విద్యార్థుల కష్టాలు చూసిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు జరుపుతుండడంతో ప్రస్తుతం ఎంతో మంది డాక్టర్లు, ఇంజినీర్లు అవుతున్నారన్నారు. విద్యా రంగంలో రాణిస్తే పేదరికాన్ని జయించినట్టేనని, అందరికీ ఉన్నత విద్య అందించి జీవన విధానాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వివరించారు. జగనన్న విద్యా కానుక కింద భీమిలి నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.20 కోట్లు విలువ చేసే విద్యా కానుక కిట్లను అందజేశామన్నారు. సెల్ఫీలతో కాలక్షేపం చేస్తున్న టీడీపీ నాయకులకు సత్తా ఉంటే గ్రామాల్లోకి రావాలని సవాల్ విసిరారు. అనంతరం ఆనందపురంలో కొత్తగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి, ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, ఎంపీడీవో అడపా లవరాజు, సర్పంచ్ చందక లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, సహకార సంఘం అధ్యక్షుడు పాండ్రంకి అప్పారావు, నాయకులు బంటుబిల్లి మణిశంకర నాయుడు, చందక సూరిబాబు, బీఆర్‌బీ నాయుడు, కోన శ్రీను పాల్గొన్నారు.

రెండు సచివాలయాల్లో భూ రిజిస్ట్రేషన్లు



శొంఠ్యాం సచివాలయంలో భూ రిజిస్ట్రేషన్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

ఆనందపురం: స్థానికంగానే గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకునే వెసులుబాటు కలిగిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు భూ రీ సర్వే జరిగిన మండలంలోని రెండు సచివాలయాల్లో శనివారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అమల్లోకి వచ్చింది. దీంతో ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న స్థానికుల కల నెరవేరినట్టయింది. తమకు ఇక కష్టాలు ఉండవని, మోసపోవడానికి కూడా అవకాశం ఉండదని భావిస్తున్నారు. మండల ప్రత్యేకాధికారి, కోనేరు రంగారావు కమిటీ ప్రత్యేక ఉప కలెక్టర్ కె.సత్యపద్మ మండలంలోని శొంఠ్యాం, కణమాం సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు తమ పత్రాలతో సచివాలయాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చని వివరించారు. దళారీలను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం మిగతా గ్రామాల్లో కూడా భూ రీ సర్వే జరుగుతోందని, పూర్తయిన వెంటనే అన్ని సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. కణమాంలో సంస్థ డీడ్, శొంఠ్యాంలో విల్ డీడ్ దస్తావేజులను కక్షిదారులకు అందజేశారు. తహసీల్దార్ లోకవరపు రామారావు, ఆనందపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ షేక్ మొహిద్దీన్, సచివాలయ కార్యదర్శులు ఝాన్సీ, సత్యనారాయణ, నాయకులు లెంక రాంబాబు, పల్ల రమణ, పినిశెట్టి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

చెత్త వేరు చేసి అందించాలి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు రామన్నపేట శ్రీసాయి రవీంద్ర పాఠశాలలో ప్లాస్టిక్ అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు మాట్లాడుతూ మహిళలు ఇంటి వద్దే తడి, పొడి, ప్రమాదకర చెత్తను వేరుచేసి క్లాప్ వాహనాలకు అందించాలని కోరారు. పాలిథిన్ సంచులకు బదులుగా గుడ్డ సంచులు వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ ఆవరణలో తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.




ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కలిగిస్తున్న సచివాలయ కార్యదర్శులు

వ్యాసరచన పోటీల విజేతలకు సర్టిఫికెట్లు

ఆనందపురం: కేంద్ర యువజన క్రీడల మంత్రిత్వ శాఖ నేతృత్వంలో నెహ్రూ యువ కేంద్రం భీమిలి డివిజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాస రచన పోటీల విజేతలకు శనివారం బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. వర్షపు నీటిని ఎలా నిల్వ చేయాలి అన్న అంశంపై ఆనందపురంలో ఉన్న వివేకానంద కళాశాలలో వ్యాస రచన పోటీ నిర్వహించగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ఏబీవీపీ నాయకుడు అచ్చిబాబు, తగురుబోతు పైడి శంకరరావు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆంజనేయ స్వామికి పూజలు



విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకుడు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా క్షీర, పుష్పాభిషేకాలు నిర్వహించారు. భక్తులు సామూహికంగా స్వామి వారిని కొలిచి తమలపాకులు, సిందూర పూజలు చేశారు. భజన బృందం భక్తి గీతాలను ఆలపించింది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు



లా కాలేజీ రోడ్డులో ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న జీవీఎంసీ అధికారులు

మధురవాడ: విశాఖ రూరల్ మండలం మధురవాడ లా కాలేజీ రోడ్డులో ప్రభుత్వ భూమి పరిరక్షణకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. సర్వే నంబరు 363/3లో 1.96 ఎకరాల విస్తీర్ణం కలిగిన భూమి ఆక్రమణకు కొందరు యత్నించగా శనివారం జీవీఎంసీ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి, ప్రభుత్వ భూమిని పరిరక్షించారు. జీవీఎంసీ డీసీసీ నరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ కూన వేంకటేశ్వరరావు, టీపీవో వరప్రసాద్, సిబ్బంది బోర్డు ఏర్పాటు చేశారు. జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి పర్యవేక్షించారు. గతంలో ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న భూమిని మధురవాడ జోనల్ కార్యాలయం నిర్మాణం కోసం ఖాళీ చేయించి శుభ్రం చేయించారు. ఈ క్రమంలో కొద్ది కాలంగా ఖాళీగా ఉండడంతో కొందరు ఆక్రమణకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభం



తరగతి గదుల నిర్మాణం కోసం తీసిన గోతులు

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 12 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. పాఠశాలలో సుమారు 4 వేల మంది విద్యార్థులుండగా 52 తరగతి గదులు మాత్రమే ఉండడంతో పూర్తి స్థాయిలో వసతి సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు – నేడు' పథకంలో భాగంగా రూ.2.40 కోట్లతో 20 గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే పడమర వైపు ఉన్న మొదటి అంతస్తుపై 8 గదుల నిర్మాణం పూర్తయ్యింది. హైవే వైపు మరో 12 గదుల నిర్మాణానికి గోతులు తవ్వి పనులు ప్రారంభించారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



కొయ్యపేటలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే ప్రస్తుత పథకాలన్నీ కొనసాగుతాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురం, కొయ్యపేట, నేరెళ్లవలసలో శనివారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్వయం సహాయ సంఘాలకు రుణమాఫీ చేయకుండా, సున్నా వడ్డీ ఇవ్వకుండా మహిళలను మోసం చేశారన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి రాగానే నెరవేర్చారన్నారు. విజయానందపురం పంచాయతీకి సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.15.66 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. కొయ్యపేటలో తాగునీరు, లో ఓల్టేజీ సమస్యలు పరిష్కరించాలని, మురుగు కాలువలు నిర్మించాలని ప్రజలు విన్నవించారు. తక్షణమే ఈ సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, తహసీల్దార్ తోట శ్రీవల్లి, తునివలస ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సారిక శంకరరావు, రేవళ్ల సూరిబాబు, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, చందక శ్రీను పాల్గొన్నారు.

సీఎం జగన్‌కే యువత మద్దతు

వైఎస్సార్‌సీపీ యువజన విభాగ కమిటీల్లో నియామకాలు



యువజన విభాగం విశాఖ అధ్యక్షుడు అల్ల శివగణేష్

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో సుస్థిర పాలన అందిస్తున్న, వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే యువతంతా మద్దతు పలకాలని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అల్ల శివ గణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూ కాలనీలోని పార్టీ యువజన విభాగం కార్యాలయంలో శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో యువజన విభాగ రాష్ట్ర, జిల్లా, మండల, వార్డు స్థాయి కమిటీల నియామకాల ప్రక్రియ మొదలైందన్నారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన యువకులు, జగనన్న అభిమానులు, పార్టీ యువజన విభాగ కార్యకర్తలంతా ముందుకు రావాలన్నారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌నే గెలిపించే బాధ్యతను అందరూ తమ భుజస్కందాలపై వేసుకోవాలని కోరారు. నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తల ద్వారా మద్దిలపాలెంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని అల్ల శివగణేష్ విజ్ఞప్తి చేశారు. యువజన విభాగం నాయకుడు జీలకర్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన కాన్టెక్ ఎక్స్‌పో -2023



కుమార్ రాజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాన్టెక్ ఎక్స్‌పో 2023 శనివారం కూడా కొనసాగింది. బీచ్‌రోడ్డులోని గాదిరాజు ప్యాలస్ వేదికగా ఈ ఎక్స్‌పో ద్వారా ప్రదర్శిస్తున్న నిర్మాణ రంగ ఉత్పతులను తిలకించేందుకు శనివారం సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డీజీఎన్‌పీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ బ్రిగేడియర్ ఎస్.రామనాథన్, కోస్ట్‌గార్డ్ చీఫ్ ఇంజినీర్ ఎంఎల్ వర్మ తదితరుల అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు స్టాల్స్‌ను తిలకించారు. అనంతరం వారిని నిర్వాహకులు సత్కరించారు.

ఈ ప్రదర్శనలో భాగంగా యూనియన్ బ్యాంకు, మహామాయ సిమెంట్, సాగర్ సిమెంట్, వరుణ్ జేసీబీ స్టాల్స్‌ను వ్యాపారులు పెద్ద ఎత్తున సందర్శించారు. ఈ ఎక్స్‌పో ద్వారా 60 స్టాల్స్‌ను ప్రదర్శించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు ఈ ప్రదర్శనలు సాగాయి. ఈ కార్యక్రమంలో బీఏఐ విశాఖ చాప్టర్ చైర్మన్ వెంకటేశ్వర్లు, అఖిల భారత సభ్యుడు రామకోటయ్య, మాజీ చైర్మన్ కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లబ్ధిదారులకు శిక్షణ

మహారాణిపేట: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు లబ్ధిదారుల నుంచి చక్కటి స్పందన కనిపించింది. ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) స్కీమ్ కోసం గత వారం జిల్లా జాయింట్ కలెక్టర్ విశ్వనాథం ఇచ్చిన ప్రకటనకు స్పందిస్తూ 19 మంది ముందుకు వచ్చారు. వీరికి శనివారం తాటిచెట్లపాలెం ఏపీఎఫ్‌పీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. లబ్ధిదారులకు జోనల్ మేనేజర్ సాయి శ్రీనివాస్ పలు అంశాల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి కె.మన్మథరావు, డీఆర్‌పీ ప్రతాప్‌కుమార్, ఎస్.వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం అమలుకు కమిటీలు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ప్రారంభించనున్న జగనన్న సురక్ష పథకం అమలుపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు శనివారం భీమిలి మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కల్పించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, ఎంపీడీవో పి.వెంకటరమణ మాట్లాడుతూ మండల పరిధిలో ఈ పథకంపై 13 గ్రామ సచివాలయాల్లో ఈ నెల 24 నుంచి 30 వరకు ఇంటింటా సర్వే చేపడతామన్నారు. మండల కమిటీ పర్యవేక్షణలో సంక్షేమ పథకాలు పొందడానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. వీటిలో 9 సచివాలయాలకు ఎంపీడీవో పర్యవేక్షణలో, మిగిలిన 4 సచివాలయాలకు తహసీల్దార్ పర్యవేక్షణలో కమిటీలు వేయనున్నట్టు తెలిపారు. పంచాయతీ విస్తరణ అధికారి జి.అప్పలరాజు పాల్గొన్నారు.

ఆనందపురం: ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో అడపా లవరాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలో గల 18 సచివాలయాల సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లవరాజు మాట్లాడుతూ వలంటీర్లు అన్ని కుటుంబాలను కలిసి సమస్యలు తెలుసుకుని సచివాలయానికి అందజేయాలని కోరారు. వాటిని శాఖల వారీగా విభజించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కరుణాకరరావు పాల్గొన్నారు.

డిగ్రీ, పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో 2023–24 నూతన విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ అడ్మిషన్లు ఈ నెల 19 నుంచి జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు WWW.OAMDC.AP.GOV.IN పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7780168423 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

23న మహా లింగార్చన



బ్యానర్‌తో బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

తగరపువలస: లోక కల్యాణార్థం బంగ్లామెట్ట శివాలయంలో ఈ నెల 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మహా లింగార్చన నిర్వహించనున్నారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని శ్రీజగద్గురు ఆదిశంకరాచార్య బ్రాహ్మణ పురోహిత, అర్చక సంఘం ప్రతినిధులు కోరారు. అనంతరం తగరపువలస, చిట్టివలస, సంగివలస అర్చకులు బ్యానర్ విడుదల చేశారు.

వెల్‌నెస్ సెంటర్ పరిశీలన



వెల్‌నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

ఆనందపురం: మండలంలోని లొడగలవానిపాలెం వెల్‌నెస్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు శనివారం సందర్శించారు. అక్కడి సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమావేశమయ్యారు. ఎన్‌సీడీ సర్వే సక్రమంగా చేయాలని, గర్భిణులను గుర్తించి టీటీ ఇంజక్షన్లు అందించాలని సూచించారు. వైద్యాధికారి కోరాడ శైలజ ఉన్నారు.